# అర్థం తెలిసిన నాటిచక్రం

— ఇచ్ఛాపురపు జగన్నాథరావు

సాయంత్రం అయిదు గంటలు కొట్టేసరికి అప్పారావు కాళ్ళూ, చేతులూ ముఖమూ కడుక్కుని లోపలికి వెళ్తాడు. అప్పటికి అమ్మగారు చిట్టిబాబుకి నీళ్ళుపోసి, తలదువ్వి, పౌడరు అద్ది, చక్కటి లాల్చి, చిన్న నిక్కరూ కట్టి, దిష్టి తగలకుండా ముఖాన నల్ల బొట్టుపెట్టి సిద్ధం చేస్తూంటారు.

అప్పారావుకి ఇంక చాలా తక్కువ పని మిగులుతుంది. చిట్టిబాబుగారి చిన్న బూట్లు మూలనించి తీసి, శుభ్రం చేసి తొడిగి, "రండి బాబూ!" అని పిలుస్తాడు. చిట్టిబాబు చేతులందిస్తాడు. అప్పారావు చిట్టిబాబుని ఎత్తుకుని నడుస్తాడు. వీధి గుమ్మందాకా వాళ్ళిద్దరినీ సాగనంపి అమ్మగారు "కాస్త పెందరాళే ఆయనా వస్తే, నేనూ వద్దును" అని నెమ్మదిగా అంటారు: అలా అనుకోవడమే కాని, బాబుగారు అయిదు గంటలు దాటాకగాని ఎప్పుడూరారు.

"జాగ్రత్త అప్పారావ్!"

చివరగా ఈ జాగ్రత్త చెప్పడం ఆమెకు పరిపాటి. "ఫరవాలేదమ్మా!" అంటూ ధైర్యం చెప్పే చిరునవ్వు వ్వి ఇద్దరూ—అప్పారావు, చిట్టిబాబూ బయలుదేరతారు. ఇంక చిట్టిబాబు వెనక్కి చూడడు.

ఆ వీధిమలుపు పది అడుగుల్లో వచ్చేస్తుంది. మలుపు దాటగానే ఆడపిల్లల హాస్టలు. ఆ టైము కందరూ వచ్చి పైని బంతాటలూ అవీ ఆడుకుంటూంటారు.

వారిలో ఎర్రటి అమ్మాయ్-బుగ్గమీద పెద్ద పుట్టు మచ్చే ఆమె గుర్తు-ఎప్పుడూ రోడ్డు వైపు చూస్తూ కుర్చీలో కూర్చుంటుంది. అప్పారావు కంటబడగానే గబగబ దగ్గరికి వస్తుంది. అతని చేతుల్లోంచి పిల్లాణ్ణి తన చేతుల్లోకితీసుకుని "రా, పాపాయ్!" అంటుంది..

వాణ్ణామె తన ప్రాణమల్లే చూసుకుంటుంది. హృదయానికి హత్తుకుంటుంది. బుగ్గలకి బుగ్గలు తాకిస్తుంది. చేతితో సున్నితంగా వాడి బుగ్గలు సాగదీస్తుంది. ఒళ్ళో కూర్చోబెట్టుకుని చాక్‌లెట్లు ఇస్తుంది.

చిట్టిబాబు ఏమీ మాట్లాడడు. ఆమెవైపు తెల్లబోయి చూస్తాడు; తిరిగి అప్పారావు వైపు చూస్తాడు. అప్పారావు అనుకుంటాడు...."పాపం, అలా నలిపేస్తే పసిగందు ఎలాగుంటాడు!" అని.

ఇంతట్లో టెనికాయిట్ ఆడుతూన్న అమ్మాయిల్లో ఒకరు రింగ్ విసిరేసి పరుగున చిట్టిబాబు దగ్గరకు వస్తూ, ఎర్రటి అమ్మాయి దగ్గరనించి వాడిని తీసుకుంటుంది. ఆమె మరీ బలవంతంగా వాడిని ముద్దు పెట్టుకుంటుంది. వాడు ఏడుపుముఖం వేస్తాడు.

'ఛీ!—నువ్వింతేనే. వాడినేడిపించావ్ చూడు."



ఎర్రటి అమ్మాయి కోపంగా అని, మళ్ళీ వాడిని తీసుకుంటుంది. "ఏం జాగ్రత్తే!....నీకొడుకైతే అనలు..."

ఈనరి కందరూ చుట్టూ చేరతారు. అందరూ కలిసి నవ్వుతారు. ఎర్రటి అమ్మాయి ముఖం ఇంకా కంది మరీ ఎర్రగా అవుతుంది. "ఏడిశావ్‌లే....నువ్వు—" కాని, ఆ మాటలు వాళ్ళ నవ్వుల్లో కలిసిపోతై.

అప్పారావిదంతా చూసి నవ్వుదామనుకుంటూ "పాపం! ఎంత ఘనసో!...ఆవిణ్ణంటారు కాని అందరు పిల్లలూ అంతే" ననుకుంటాడు.

చిట్టిబాబు వాళ్ళని నెమ్మదిగా తప్పించుకుని అప్పారావు దగ్గరికి వచ్చి చేతులు జాపుతాడు. తిరిగి ఇద్దరూ బయలుదేరుతారు.

కొద్ది దూరం వెళ్ళేసరికి క్లబ్బు. ఆదివారం అయితే అక్కడ బంతి ఆట ఆడతారు. చిట్టిబాబు అదిచూసి ఆడుకుంటాడు....అసలు అప్పారావుకీ అది సరదాయే...కాని రోజూ వుండదుగా.

సముద్రపు వడ్డుకి బయలుదేరుతాడు. చిట్టిబాబు చాక్‌లెట్ తింటూ ఆడుకుంటూంటాడు.

అప్పారావు మనస్సులో అనేక ఆలోచనలు వస్తాయి. ముందర తనబ్రతుకుకీ, చిట్టిబాబు బ్రతుకుకీ గల వ్యత్యాసం చూసుకుంటాడు. తాను ఆ పసివాడికి కూడా సేవ చెయ్యాలి. ఆ ఎంగిలి తనకి రాస్తోంటే మాట్లాడడానికి వీల్లేదు. ఎలా చెప్తే అలా నడవాలి. ఆయన కాలు క్రింద పెట్టనివ్వకూడదు. తరువాత తన యింటిదగ్గర తన కొడుకు జ్ఞాపకం వస్తాడు. ఆరేళ్ళవాడికి పలకా పుస్తకాలు కొనియివ్వడానికి కూడా తనకి కుదరలేదు. వాడు రోడ్లమ్మట తిరిగి ఏడుస్తోంటే, తాను పిల్లాడికి సేవ చెయ్యాలి. నలభైఏళ్ళ తాను నలభై నెలల పిల్లాడికి....

అప్పారావుకి కళ్ళు ఎర్రనౌతై. క్రిందని కంకర కాళ్ళకి గుచ్చుకుంటుంది. క్లబ్బునించి సముద్రందాకా రోడ్డంతా అంతే. అప్పుడు అతని కళ్ళు చిట్టిబాబు జోళ్ళమీద పడతై - తన నడకకి కలిగే కదలికకి వాడి కాళ్ళు ముందుకీ వెనక్కీ ఊగుతూంటే, ఆ జోళ్ళు అప్పారావు కడుపుకి కదులుతూంటాయ్. చిట్టిబాబు చాక్‌లెట్ తింటూంటాడు.

ఇంక అప్పారావు భరించలేడు. కోపం, ఏడుపూ వచ్చినట్లవుతై ఒక్కసారి. ఆసమయంలో అతనికి

## ఈ కథ ఎందుకు?

చేసేది సుళువైన 'ఉద్యోగం' కావచ్చు. కాని అందులోనూ బరువైన బాధ్యత వుంటుంది. చిన్నారి చిట్టిబాబుని సాయంత్రం అలా బయటకు తీసుకువెళ్ళడమే అప్పారావు 'ఉద్యోగం' చిట్టిబాబు కాళ్లు నేలమీద పెట్టకుండా అప్పారావు అతనిని ఎత్తుకుని తిప్పాలి. అనుకోకుండానో, అనుకునో అప్పారావు తప్పుచేశాడో...చిట్టిబాబుని నడిపించినందుకు అప్పారావుకి 'శిక్ష' లభించింది. అతని ఉద్యోగం పోయింది. చేసిన అపరాధానికి ఉద్యోగంపోవడం న్యాయమయితే, జీతం తీసుకోవడం అన్యాయంకాదా అన్న ఆలోచన కలిగిన అప్పారావు ఏంచేశాడు?

ఒక చిన్న వస్తువుతో మనసు లోతులనితాకేలాగా కథని అల్లడం అందరికీ సాధ్యం కాదు. ఆ నేర్పేశిల్పం అదే ఇచ్ఛాపురపు జగన్నాధరావుగారి 'అద్దం తిరిగిన నీతిచక్రం'లో కనిపిస్తుంది. ఆలోచింపచేసేకథ. అందుకే ఈ కథ.

అమ్మగారి ఆత్రుతతో కూడిన కళ్ళూ, ఎర్రటి అమ్మాయ్ అప్యాయంతో కూడిన కౌగిలింతా, అమాయకత్వం తొణికిసలాడే చిట్టిబాబు కళ్ళూ ఇలాంటివేవీ జ్ఞప్తికిరావు. తన దారిద్ర్యం, దాన్ని వెక్కిరిస్తూ ఆ చిన్నవాడి ధనికత్వం, తన కొడుకు గతీ, చిట్టిబాబు దర్జా...ఇలాంటివి అతనికి జ్ఞప్తికి వస్తాయి.

ఒక్కసారి చిట్టివాణ్ణి ఆ కంకరలోకి దింపులాడు. "ఆ కాఠిన్యం నీ జోడు క్రింద కూడా ఎలాగ వుందో చూడు" అందామనుకుంటాడు. చిట్టివాడు ఒకసారి తెల్లబోయి చూసి నెమ్మదిగా నడక సాగిస్తాడు. అప్పారావు వెనకాల వస్తూంటాడు.

కంకరమీద వాడి కాళ్ళు జారుతూంటాయ్. కాని, వాడిని పడనీకుండా అప్పారావు పట్టుకుంటూంటాడు. జాలితో కాదు, వాడిబట్టలు దుమ్మయితే అమ్మగారికి తెలుస్తుందని.

చిట్టిబాబు నెమ్మదిగా కష్టంగా నడుస్తాడు కొద్ది అడుగులు వేసేక అప్పారావు వాడు పట్టుకోడానికి తన వేలు యిస్తాడు "అదే పోయిందిలే" అనుకుంటాడు. వాడి వచ్చీరాని మాటలతో ఏదో చెప్తోంటే అవేవీ అతనికి వినపడవు. ఒక సంతృప్తి అతననుభవిస్తాడు.

సముద్రపు ఒడ్డుకి వస్తారిద్దరూ. చిట్టిబాబు ఇసకలో కూర్చుంటాడు. వాడి బట్టలు మాయడానికి వీలులేదుగా: అప్పారావు కోపంగా వాణ్ణి నిలబెట్టి తనపైమీది తువాలు క్రిందపరిచి దానిమీద వాడిని కూలవేస్తాడు. తరువాత తన ఆలోచనల్లో పడతాడు.

కెరటాలని చూస్తూంటే అప్పారావుకి తన గడచిన జీవితం అంతా జ్ఞప్తికి వస్తుంది. తండ్రి చనిపోయేనాటికి తనకొచ్చిన రెండెకరాల ముక్కా దావాలో పోవడం, తరువాత తాలూకా ఆఫీసులో బంట్రోతు గిరీ, తరవాత పదేళ్ళ తరవాత ఆ ఉద్యోగంనించి డిస్మిస్ కావడం, తరువాత ఉద్యోగం కోసం తిరిగి తిరిగి చివరికి ఈ ఉద్యోగంలో చేరడం అన్నీ అతనికి జ్ఞప్తికి వస్తాయి.

ఒక రోజు అతనికళ్ళు చెమరుస్తాయి ఈ తలపుకి. మరోరోజు ఇప్పటికి బాగానే వుందిలే!" అనుకుంటాడు. దుఃఖంగా వున్న రోజుని చిట్టిబాబు ప్రశాంతంగా ఆడుకుంటూండడం చూస్తే అతనికి గాయంమీద కారం జల్లినట్లుంటుంది. కోసి తినేట్టు వాడివేపు చూస్తాడు.

సూర్యుడు అస్తమిస్తాడు. అప్పారావు లేస్తాడు. 'లే' అంటూ చిట్టిబాబుని చెయ్యి పట్టుకుని లేవదీస్తాడు. తువ్వాలుకి అంటుకున్న ఇసుక దులిపి, దానివైపొకసారి కోపంగా చూసి భుజంమీద వేసుకుంటాడు. "నడవగలవు...నడూ" మోటుగా అని, ఏదో సంతృప్తితో వాడిని ఆ కంకర రోడ్డమ్మటే నడిపిస్తాడు.

క్లబ్బు దగ్గరి కొచ్చేక తిరిగి వాణ్ణి ఎత్తుకుంటాడు. అమ్మగారు ఎప్పుడన్నా అమ్మాయిల హాస్టలుకి వస్తుంటారు. వాళ్ళకి తను చిట్టిబాబుని నడిపిస్తున్నాననే సంగతి తెలియడం మంచిది కాదు. ఈ సారి వాడిజోళ్ళు తన బట్టలకి తగలకుండా జాగ్రత్త పడడం మంచిది.

అయినా అమ్మాయిల హాస్టలు దగ్గరికి వచ్చేసరికి అందరూ లోపలికి వెళ్ళిపోతారు. మేడ అంతా దీపాలతో వెలుగుతూంటుంది. సాయంత్రం దృశ్యం అంతా అప్పారావు మనస్సులో మెదులుతుంది. ఆ ఎర్రటిపిల్ల జ్ఞప్తికి వచ్చి నవ్వుకుంటాడు...

ఇంతట్లో యిల్లే వస్తుంది. గుమ్మంలో టామీ చిట్టిబాబు కోసం వస్తుంది. వెనకాలే అమ్మగారూ వస్తారు. జోళ్ళువిప్పి చిట్టిబాబుని అమ్మగారికి వొప్ప జెప్తాడు అప్పారావు. "ఆడుకున్నాడా?" అని ఆవిడ అడుగుతుంది.

"ఆడుకున్నారమ్మా...!"

అప్పారావు సమాధానం చెప్పేలోపున అమ్మగారు వాడికి దిగదుడిచి ఎత్తుకుంటారు. "నీ కొడుకైతే..." రింగ్ అమ్మాయి మాటలు జ్ఞాపకం వస్తాయ్ అప్పారావుకి. ఇంతలో యిల్లు జ్ఞాపకం వస్తుంది.

"నే వెళతానమ్మా...!"

అప్పారావు యింటికి బయలు దేరుతాడు. ఆ తాటాకుల యింటిలోకి అడుగు పెట్టేసరికి అడది గంజి ఉడకేస్తూ వుంటుంది. కొడుకు ఒకమూల కూర్చుని తరుచుగా ఆకలి అని ఏడుస్తూంటాడు. అప్పారావు ఆ వాకిట్లో వున్న నులకమంచం మీద కూలబడి గంజి సిద్ధం అయేదాకా యెదురుచూస్తాడు. ఉదయం లేచి చల్దివేళ దాకా యింటిదగ్గర వుంటాడు. అప్పుడు వెళ్ళి ఒంటిగంటకి వచ్చి కూడుతిని వెళ్తాడు.

మళ్ళా సాయంత్రం ఐదు గంటలు. మళ్ళా...మళ్ళా...

* * *

**అ**లాంటి ఓ రోజుకి అప్పారావు అక్కడచేరి నెల పూర్తి అయింది. మధ్యాహ్నం ఒంటిగంటకి అప్పారావు యింటికి వెళ్తూంటే అమ్మగారు అప్పారావుని పిలిచి నలభై రూపాయిలూ చేతిలో పెట్టారు.

అప్పారావలా నలభై రూపాయలు పుచ్చుకుని చాలా కాలమైంది. ఉద్యోగంనించి డిస్మిస్ అయాక వారం రోజులు ఒక్కసారి పని దొరికితేగా!

ముందర బజారుకి వెళ్ళి అప్పారావు ఒక పలకా పుస్తకమూ కొన్నాడు; తనకి తువ్వాలు కొనుక్కున్నాడు. కొత్త పలకా, పుస్తకమూ చూసిన కుర్రాడు సంతోషంగా గెంతసాగాడు. ఆ ఆనందం చూసేసరికి తన జన్మ తరించిందనుకున్నాడు.

మామూలుగా సాయంత్రం ఐదు గంటలయేసరికి చిట్టిబాబుని తీసుకుని బయలుదేరాడు అప్పారావు. వీధి మళ్ళేసరికి అమ్మాయిల హాస్టలు, ఎర్రటి అమ్మాయి సిద్ధంగా వుంది.

కాని ఈ రోజు బెనీకాయిట్ పిల్ల ముందైపోయింది. ఎర్రపిల్ల బుంగమూతి వేసింది.

ఒకామె "అలా పరాయిపిల్లల కోసం కొట్టాడుకోబోతే..." అని ఆపింది. అందరూ విరగబడి నవ్వారు.

అప్పారావు ఈ రోజు నవ్వావులేక పోయాడు. సంతృప్తిగా నవ్వి "ఏం పిల్లలు! అన్నిటికీ తొందరే" ననుకున్నాడు.

ఇవాళ చిట్టిబాబుకి టాఫీ ఇప్పించారు వాళ్ళు. క్లబ్బు దగ్గర నుంచి కంకర రోడ్డుదాకా వచ్చారు. అప్పారావు ఆలోచనల్లో రోడ్డు మీద అడుగువేసేసరికి గుచ్చుకుని తెలివి తెచ్చుకున్నాడు.

అలవాటుగా చిట్టిబాబు అతని చంకనించి దిగజారాడు. మండుతున్న కాళ్ళు చూసుకుని అప్పారావు మామూలుగా వాడిని దిగనిచ్చాడు.

ఒక్కసారి అప్పారావుకి నాలుగు పదిరూపాయల నోట్లూ, కొత్త పలకా పుస్తకమూ చూసిన కొడుకు ఆనందమూ, భార్య సంతోషమూ జ్ఞప్తికి వచ్చాయ్. చిట్టిబాబు నడిస్తూనే వున్నాడు.

"ఎవరిమూలంగా వచ్చిందీ డబ్బు?"

ఎవరో అతన్ని అడిగినట్లనిపించింది అప్పారావుకి. ఎవరి మూలంగా? తొందరగా తనకి తాను జవాబిచ్చుకున్నాడు "నా మూలంగానే-శ్రమ పడ్డాను; ఆర్జించాను" అని.

కాదు...కాదన్నది మనస్సు. చిట్టిబాబు మూలంగా తనకీ వృత్తి దొరికింది. ఆయన ఉండకపోతే తనకీ వృత్తే లేదు. ఈ సుళువైన వృత్తి.

రాళ్ళమీద చిట్టిబాబు అలవాటుగా అడుగులు వేస్తూ నెమ్మదిగా నడుస్తూనే వున్నాడు. వాణ్ణి చూడగానే తాను కృతఘ్నుడనే బాధ ఒక్కసారిగా వచ్చింది అప్పారావుకి. అమ్మగారు తనని నమ్ముకుని వుంటే చిట్టిబాబుని తాను...

అప్పారావుని సామ్యవాదం కన్నా ధనవంతుల మీది కోపం కన్నా చిట్టిబాబు పడుతున్న శ్రమా, తాను చేస్తున్న మోసమూ యెక్కువ బాధ పెట్టసాగాయ్. పసివాడిని తాను మోసగిస్తున్నాడు!

హటాత్తుగా చిట్టిబాబుని చేతుల్లోకి తీసుకుని గుండెలకి హత్తుకున్నాడు తనకి ఉపాధి కల్పించిన పసివాడిని...ఆ క్షణంలో ఆ బూట్లమన్నూ తనకి తగుల్తోన్న కాళ్ళూ అప్పారావుని ఏమీ బాధించలేదు హృదయంలో ఒక గొప్ప సంతృప్తి అతనికి కలిగింది. "నా విధి నేను సవ్యంగా నిర్వర్తిస్తున్నాను" అనుకున్నాడు పదేపదే.

సాయంత్రం అయి చీకటి పడుతోంటే ఆ సంతృప్తితోనే మెట్లు ఎక్కాడు అప్పారావు. అమ్మగారూ, టామీ గుమ్మంలో వున్నారు. ఆమె కొంచెం కోపంగా ఉందా అనుకున్నాడు అప్పారావు.

నిశ్శబ్దంగా చిట్టిబాబు అప్పారావు దగ్గరనించి తల్లి దగ్గరికి వెళ్ళాడు.

"ఇదిగో, ఈరోజుకి రావాల్సిన జీతం...అబ్బాయిని నడిపించి తీసుకెళ్ళడానికి నిన్ను పెట్టుకోలేదు... సాయంత్రం బాబుగారు చూసేదాకా తెలీనేలేదు." అంటూ ఆమె ఒక రూపాయీ, కొంత చిల్లరా అతనికిచ్చింది.

అప్పారావు తెల్లబోయాడు. ఏదో చెప్పబోయాడు.

కాని ఆమె ఆనరికే లోనికి వెళ్ళిపోయింది. అతను బరువుగా మెట్లు దిగి నాలుగడుగు లేశాడు. తిరిగి గుమ్మం దగ్గరికి వచ్చాడు. చేతిలో డబ్బుని గుమ్మంమీద వుంచేసి, తొందరగా బయటికి నడిచాడు.